క్లుప్తంగా

ముమ్మరంగా తనిఖీలు



చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గుడిపాల: చెక్‌పోస్ట్‌లో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో గొల్లమడుగు, ముత్తరాశికుప్పం వద్ద రెండు చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రెండు చెక్‌పోస్ట్‌ల వద్ద ఆదివారం తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వాహనాలు, ఫోన్ నెంబర్లను కూడా సేకరిస్తున్నారు.

జీడీనెల్లూరులో 79.53 శాతం పోలింగ్

గంగాధర నెల్లూరు: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు జీడీ నెల్లూరు నియోజకవర్గ కేంద్రం జీడీ నెల్లూరు ఎంపీపీ పాఠశాలలో రిటర్నింగ్ అధికారి వెంకట శివ ఆధ్వర్యంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులు 1,681 నమోదు చేసుకోగా మొదటి రోజు 1337 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటిరోజు 79.53 శాతం పోలింగ్ నమోదు అయిందని, సోమవారం సాయంత్రం వరకు పోలింగ్ జరుగుతుందని రిటర్నింగ్ అధికారి వెంకట శివ తెలిపారు.

వరసిద్ధుని సేవలో కలెక్టర్



కలెక్టర్, ఎస్పీకి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక స్వామి దర్శనం కల్పించారు. ఆశీర్వచనంతో పాటు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

అలరించిన దుర్యోధన వధ



గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని వింజం పంచాయతీ గడ్డంపల్లిలో ఆదివారం దుర్యోధన వధ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలో బంకమట్టితో భారీ దుర్యోధన ప్రతిమను ఏర్పాటు చేశారు. అనంతరం దుర్యోధన వధ ఘట్టాన్ని భీమ, దుర్యోధనుడి పాత్రధారులు రక్తి కట్టించారు. రాత్రి కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ధర్మకర్తలు చంద్రారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, రామచంద్ర రెడ్డి, చిన్నబ్బ రెడ్డి గురువారెడ్డి, సర్పంచ్ రామక్క, నాయకులు పాల్గొన్నారు.



చిత్తూరులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార సభకు హాజరైన జనసందోహం

ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రసంగిస్తున్న విజయానందరెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప



ఫ్యాను ప్రభంజనం

చిత్తూరు నగరంలోని గాంధీ సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ బహిరంగ సభకు భారీగా జనం తరలివచ్చారు. ప్రజాదరణ చూస్తే ఈ సారి ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనం సృష్టించనుందన్న చర్చ జరుగుతోంది. ఈ సభకు ముఖ్య అతిథిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై ప్రసంగించారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పాల్గొన్నారు.

–చిత్తూరు కార్పొరేషన్



సభలో పార్టీ శ్రేణుల సందడి

చంద్రబాబు కంటే ఊసరవెల్లి నయం

- టీడీపీకి ఓటేస్తే రాక్షస పాలన
- జగనన్నకు ఓటేస్తే సంక్షేమ పాలన
- చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



చిత్తూరు: ప్రచారంలో ఓటరుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రోజుకో పార్టీతో జత కడుతూ మేనిఫెస్టోతో రంగులు మారుస్తున్న చంద్రబాబు కంటే ఊసరవెల్లి నయమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. ఆదివారం 25వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవని, నాయకులు దేవరాజుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనను వివరించారు. టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఐదేళ్ల క్రితం జగనన్నను దీవించినందుకు ఇంటికే సంక్షేమ పథకాలను అందించారని మరోసారి ఆశీర్వదించి సుపరిపాలనకు బాటలు వేసుకుందామన్నారు. టీడీపీ వస్తే రాక్షసపాలన వస్తుందన్నారు. ప్రజల కోసం పని చేసే జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకోవాలన్నారు. ''ఐదేళ్లలో మంచి జరిగింటేనే ఓటు వేయమని అడుగుతున్నాం.. మరి ఆ ధైర్యం చంద్రబాబుకు ఉందా'' అని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ చల్లా ముత్తు, నాయకులు శేఖర్, హరి, శంకర్, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. జగన్‌కోసం సిద్ధమంటూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నగరంలో ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన మేలును ఓటర్లకు తెలియజేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను మరోసారి గెలిపించుకుని, రుణం తీర్చుకుందామని చెప్పారు.





గుడిపాల: కమ్మతిమ్మాపల్లెలో ప్రచారం, గుడిపాలలో ఓట్లడుగుతున్న నాయకులు, గుడిపాల: వసంతాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

రావూరికి మంత్రి శుభాకాంక్షలు




రావూరి కుటుంబ్యులతో మంత్రి పెద్దిరెడ్డి, వసంత్‌వికాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు రావూరి ఈశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు బహిరంగ సభలో పాల్గొనడానికి ఆదివారం వచ్చిన మంత్రి తొలుత రావూరి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర బలిజ సంఘం ఉపాధ్యక్షుడు వసంత్‌వికాస్ వైఎస్సార్‌సీపీలో చేరగా, మంత్రి కండువా వేసి ఆహ్వానించారు.

గాలివానతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం



సాంబయ్యకండ్రిగ వద్ద విరిగిపడిన చెట్టు



క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం వచ్చిన గాలివానతో ఆ శాఖకు భారీగా నష్టం వచ్చింది. ఎక్కువగా గాలిరావడంతో చెట్లు, ఫ్లెక్సీ, రేకులు విద్యుత్ తీగలపై పడటంతో కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం 40 ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి. దీంతో శాఖకు రూ.36.81 లక్షలు నష్టం వచ్చిందని ఈఈ పద్మనాభ పిళ్లై తెలిపారు. నగరంలో కొంగారెడ్డిపల్లె, సంతపేట, రూరల్ పరిధిలో పూతలపట్టు, రెడ్డిగుంట, జీడీనెల్లూరు, పెనుమూరు సెక్షన్లలో ఎక్కువగా నష్టం వచ్చిందన్నారు. డిపార్ట్‌మెంట్ సిబ్బంది 226 మంది, ప్రైవేటు సిబ్బంది 43 మంది కలిపి మొత్తం 269 మంది పునరుద్ధరణ పనులు చేపట్టారన్నారు. భారీ చెట్లు కొన్ని ప్రాంతాల్లో కూలడంతో వాటిని తొలగించి లైన్ పునరుద్ధరించడానికి గంటల సమయం పట్టిందన్నారు. డివిజన్ పరిధిలోని 33 కేవీ కరెంటు స్తంభాలు 11, 11 కేవీ 78, ఎల్‌టీ పోల్స్ 107, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 16 కేవీ 2, 15 కేవీ 15, కండక్టర్లు 990 మీటర్లు, కేబుల్స్ 870 మీటర్లు, 33 కేవీ డిస్క్‌లు 4, 33 కేవీ పిన్స్ 5, 11 కేవీ డిస్క్ 37, పిన్స్ 46, ఎల్‌టీ సాకెట్ 40, పిన్స్ 42 ధ్వంసమయ్యాయని వివరించారు.



నగరంలోని భరతేనగర్ లైన్‌పై పడిన చెట్టుకొమ్మలను కత్తిరిస్తున్న విద్యుత్ సిబ్బంది

రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, వైద్యులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాయలసీమలో మొట్టమొదటిసారిగా కడపలోని విద్యా సాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి 100 మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం ఈ మేరకు ఆస్పత్రిలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యాసాగర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ 2009లో కడపలో సంప్రదాయ పద్ధతిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించి మెరుగైన ఫలితాల కోసం 2019లో కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీ ని పరిచయం చేసినట్లు చెప్పారు. అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ ని 2024 లో రాయలసీమ లో మొదటిగా కడప నగరానికి తీసుకొచ్చినట్లు వివరించారు. ఊబకాయం ఉన్నవారు, ఎక్కువ మోకీలు అరుగుదల ఉన్నవారు, తక్కువ వయసులో మోకీలు మార్పిడి అవసరమైన వారు, మోకీలు దగ్గర మెటల్స్ ఉన్నవారు ఈ టెక్నాలజీ ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా 6000 లకు పైబడి మోకీల శస్త్రచికిత్స చేసిన అనుభవంతోపాటు అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ వినియోగంతో మరింత సత్ఫలితాలు సాధించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి యంత్ర సేవ

- సాగులో పనిభారం తగ్గించేందుకు యాంత్రీకరణ విధానం
- రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు




రైతులకు రాయితీపై ట్రాక్టర్‌ను అందజేస్తున్న అధికారులు, రైతులకు రొటోవేటర్‌ను రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

గుడిపాల: వ్యవసాయాభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేసింది. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారాన్ని అందించి ఆదుకుంటోంది. ఆర్థిక భారం తలెత్తకుండా ముందస్తు పెట్టుబడి నిధిని అందిస్తోంది. అదేగాక పంటల సాగులో రైతులకు పనిభారాన్ని తగ్గించేందుకు వీలుగా వ్యవసాయంలో యాంత్రీకరణ విధానాన్ని తీసుకువచ్చింది. ఇందుకు అవసరమైన ట్రాక్టర్లు, యాంత్రీకరణ పరికరాలను ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకుంది. దీంతో రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే రాయితీపై ట్రాక్టర్లు, యంత్రాలను పొంది సులభ పద్ధతిలో పంటలను సాగులోకి తీసుకువస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఏటా 5,800 హెక్టార్లలో రైతులు అన్ని రకాల పంటలను సాగులోకి తీసుకువస్తారు. ప్రధానంగా వరి, మామిడి, చెరకు, కూరగాయలు, చిరుధాన్యాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే పంటల సాగులో రోజురోజుకూ పెట్టుబడి భారం పెరగడం, కూలీల కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు రైతు భరోసా పథకం ద్వారా ముందస్తు పెట్టుబడి నిధిని ఆదుకుంటోంది. అదేగాక పనిభారం తగ్గించేందుకు వ్యవసాయాన్ని యాంత్రీకరణ విధానాన్ని తీసుకువచ్చారు. ఇందుకుగాను రైతులు సంఘాలుగా ఏర్పడి యాంత్రీకరణకు ముందుకు వస్తే ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలను అందజేసింది.

రాయితీ ఇలా..

పంటల సాగుకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీపై రైతు సంఘాలకు అందించే విధంగా చర్యలు తీసుకుంది. ప్రతి రైతు సంఘానికి ఒక యూనిట్ కింద రూ.15లక్షల మేరకు విలువచేసే ట్రాక్టర్, యంత్ర పరికరాలను అందజేస్తుంది. అందులో రాయితీ కింద ప్రభుత్వ వాటా 40 శాతం మేరకు అందించగా, రైతు వాటా కింద 10 శాతం, మిగిలిన 50 శాతం వాటా నిధులను బ్యాంకు రుణం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంది.

లబ్ధి ఇలా...

నియోజకవర్గ పరిధిలోని గుడిపాల, చిత్తూరు మండలాల్లోని రైతులు యాంత్రీకరణ విధానంతో పంటల సాగుకు ఆసక్తి చూపారు. మొత్తం 26 రైతు సంఘాలు ఏర్పాటు చేసి రాయితీపై యాంత్రీకరణ పరికరాలను పొందారు. అందులో 12 ట్రాక్టర్లతోపాటు యంత్ర పరికరాలను రాయితీపై పొందారు. ఇందుకుగాను ప్రభుత్వం రాయితీపై రూ.61 లక్షలు వెచ్చించింది. రాయితీపై పొందిన యంత్ర పరికరాలను ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద నిల్వ ఉంచుతారు. పంటల సాగుకు అవసరమైన యంత్రాలను రైతులు బాడుగకు తీసుకుని ఉపయోగించుకుంటారు. ఈ విధంగా వచ్చిన బాడుగ డబ్బులను బ్యాంకు రుణానికి చెల్లించడం చేస్తారు. ఈ విధానం వల్ల రైతులు సరసమైన బాడుగకు యంత్ర పరికరాలను పొంది పంటలను సకాలంలో సాగు చేస్తారు. దీంతో కూలీల భారం, పనిభారం తగ్గడంతో రైతులు ప్రభుత్వం అందిస్తున్న సహకారం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ అద్దెకే యంత్ర పరికరాలు



రైతులైన తమకు రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయానికి సంబంధించి ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. ఏ పనికి కావాలన్నా సమయానికి రావడం జరుగుతుంది. తక్కువ బాడుగకు తమకు దుక్కులు దున్నడానికి గాను, పంటల సాగుకు అవసరమైన అన్నిరకాలుగా అవసరపడుతున్నది. బయటకన్నా తక్కువధరకే అందుబాటులో ఉంది. –భానుమూర్తిరెడ్డి, పాపసముద్రం, గుడిపాల

రైతులకు అందుబాటులో ఉంది



మా గ్రామంలో రైతులకు ఎల్లప్పుడూ ట్రాక్టర్ దుక్కులతో పాటు అన్నింటికీ అందుబాటులో ఉంది. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎరువులు, వేరుశనగకాయలతో పాటు దుక్కులు దున్నడం, వ్యవసాయ పరికరాలు అన్ని రైతు భరోసా కేంద్రంలోనే తక్కువ ధరకే అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులను ఆచరించాల్సిన పని లేకుండా ప్రభుత్వమే అన్ని చూసుకుంటోంది.

– ప్రవీణ్‌రెడ్డి, చిత్తపార, గుడిపాల

ఎవరినీ అడుక్కోవల్సిన పని లేదు



గతంలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నాలన్నా వారిని అడుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేవు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు కావాల్సిన పరికరాలన్నీ అందుబాటులో ఉన్నాయి. సాగుకు కావాల్సిన పెట్టుబడి కూడా ప్రభుత్వమే అందిస్తోంది.

–శేఖర్, రాసనపల్లి, గుడిపాల